# గాంధీ స్మృతి

**ఒరియా మూలం : శ్రీ శ్రీ అనువాదం**

జ్ఞాపకం వస్తున్నావు
గాంధీజీ ఈ నాడు నీవు
మర్మాంతిక వహ్ని జ్వాలా
మహోగ్ర దుస్సహ తాపం

జ్ఞాపకం వస్తున్నావు
గాంధీజీ ఈ నాడు నీవు
రక్తం పీల్చే నాగరికాల
క్రూరమైన అభిశాపాల

జ్ఞాపకం వస్తున్నావు
విపర్యస్త వివేకాల
ఖాండవ దహనాల
విజృంభణలో నీవు

మా అశాంత హృదయాల
దగ్ధ ప్రసూనోద్యానాల
జ్ఞాపకం వస్తున్నావు
గాంధీజీ నీవు.

ఇప్పుడు చెప్పు ప్రియః గాంధీజీ
ఎక్కడుంది నీ వాశించిన
సంక్రందన ధామం

ఎంతదూరం శీర్ణ చింతనకి
శిథిల చేతనకి

ఎంతదూరం ఆ శాంత సౌమ్య సువర్ణ
సంక్రందన నందన నగరం

మారువేషాల మారీచ గణాలం మేము
మాటిమాటికీ నిన్ను చంపేస్తున్నాము.
యుగయుగాలుగా సత్యాన్ని
హత్య చేస్తున్నాము

ఎందువల్లనంటే అసత్యం ఒకట్టే
మా ఆసరా కాబట్టి

పరిపక్వ దురహంకారాల
పరిలిప్త దురభిమానాల
పరమపద సోపానాల
శూన్యతా శిఖరాల నెక్కి
పూరతము పెదుకాడుతున్నాము
అంధకార మహోత్సవాల
ఘన తమిస్రాన్ని
కాస్తున్నాం ఆవాహనాల
మాలోక రవి కిరణాల

ధరించి హస్తాల
మదమత్త ధృష్ట కరవాలాల
ఎగిరించ బోతాం గగనాల
దిగ్దిగంతాల శాంతి కపోతాల
దహించి కంకరరాళ్ళ నరకాల
పంకిల సంకుల పథాల
వెదకబోతాం స్వర్గానికి మార్గాలు
ఎక్కడున్నాయో ఎరుగక
ఎంతదూరమో తెలియక

కాపట్యాల వలయాల
పరస్పర ప్రతారణాల
తోరణాల మహోత్సవాల
కరతాళాలు రేగే వేళ

హే శతాబ్ది రథసారథీ
నిరంతర నిస్తంద్ర వివేక ప్రహరీ
జ్ఞాపకం వస్తావా నీవు
మరచిపోయిన మా మనః కుహరాల

దురంతా హే ఉత్తాన పాదా
లక్ష్యాల సాధనాల సిద్ధి పథాలలో
మృత్యువుతో సంగ్రామాలలో
చిరంతన జీవన స్వాదు మధువు
గ్రోలిన వాడా

సురుచికీ సునీతికీ నడుమ నిలిచిన
మిలన బిందూ

స్వప్నాల వాస్తవాల
ధ్రువరూపాల
అపురూప సమన్వయాల
సాధించావు, స్థాపించావు నీవు

హే నిపుణ దక్ష నిర్మాణ శిల్పీ
జీవిత మహాకావ్య కోశాల
త్వదీయ మృదూక్తి సుధలు
అనవాప్త కర్మ కథలు

స్వప్నాల కోరకాల
ఛురకుల చిక్కిన మా ప్రాణాల

నిబిడ నిరాశాంధకారాల
అవకుంఠనాల
తొలగించిన తొలి సూర్య
కిరణానివి నీవు

జీవితాల
అభ్రంకషోత్తుంగ శిఖరాల
రచించి నవరాగాల
నిశీథాల
ఘన ఘోర తిమిరాల
శృంఖలాల
తెమలించిన శుభోదయానివి నీవు
ఉషస్సమయాల
ఉజ్జ్వల హాసాల
ఘటించి గంధయుక్త
ఛందయుక్త
వర్ణమయ విచిత్ర సంభారాల
వికసించిన పసిపాపవు నీవు
విశ్వానికి కనుపాపవు నీవు
రక్తంలో రక్తకణాల
అశ్రులలో అశ్రుజలాల
కలగలిపి అశేష జనాల
రిక్త హృదయాల

మోడయిన శాఖలపై నిశ్వాసాల
ఆరక్త కరవీర కోరకాల
తొడిమ కట్టించిన తోటమాలివి నీవు
మరిన్ని ప్రాణాలతో ప్రాణాల
హసనాలతో హసనాల
మేళవించి అగణిత జనాల
జీవితాల వీణలపై నవలాస్యాల
ఆశా మోహన రాగాల

జడులు వర్షించిన
శ్రావణ మేఘానివి నీవు
కావున హే శక్తిమయా
అగ్రపథికా

నేడీ శతాబ్దాల యాత్రాధ్వాలలో
కాలపు అంచుల్లోని ఆకాశాలలో
చిర దీప్తివంతుడివి
చిర వహ్నిమంతుడివి
అనిర్వాణ జ్వలంత జ్యోతిష్మంతుడివి నీవు.

[ ఆకాశవాణి సౌజన్యంతో ] ★